సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

శుక్రవారం । 22 । ఆగస్టు । 2025



.. మారణాయుధాల పట్టివేత

అక్రమంగా తరలిస్తున్న గంజాయితో పాటు నిందితుల నుంచి మారణాయుధాలను స్వాధీనం చేసుకున్న ఘటన పాల్వంచలో చోటుచేసుకుంది. 8లో



ఆశలు.. అడియాసలేనా ?

సీఎం సారొస్తారని.. తమ సమస్యలు పరిష్కారం అవుతాయని అనుకున్న బెండాలపాడు గిరిజనుల ఆశలు అడియాసలయ్యాయి. 8లో

గరిష్ఠం / కనిష్ఠం
32° / 25°

వాతావరణం

జిల్లాలో శుక్రవారం సాధారణ ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. సాయంత్రం తర్వాత ఆకాశం మేఘావృతమై, అక్కడక్కడా జల్లులు పడతాయి.

న్యూస్‌రీల్

వైభవంగా రుద్ర హోమం



సువర్ణ పుష్పార్చన చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: మండలంలోని పెద్దమ్మతల్లి ఆలయంలో మాసశివరాత్రిని పురస్కరించుకుని గురువారం రుద్రహోమం, అమ్మవారికి సువర్ణ పుష్పార్చన నిర్వహించారు. తొలుత మేళతాళాల నడుమ స్వామి వారిని అర్చకులు ఊరేగింపుగా తీసుకొచ్చి మండపారాధన, గణపతిపూజ అనంతరం రుద్రహోమం చేశారు. ఆ తర్వాత అమ్మవారికి 108 సువర్ణ పుష్పాలతో అర్చన నిర్వహించారు. వేదపండితులు పద్మనాభశర్మ, రవికుమార్‌శర్మతో పాటు ఆలయ చైర్మన్ బాలినేని నాగేశ్వరరావు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

మేకపాల ఉత్పత్తులపై శిక్షణ

జిల్లా నుంచి వెళ్లిన ముగ్గురు పశువైద్యాధికారులు



శిక్షణ పొందుతున్న ఉద్యోగులు

సూపర్‌బజార్(కొత్తగూడెం): మేకల పెంపకం, పాల ఉత్పత్తుల తయారీ విధానాలపై శిక్షణ పొందేందుకు జిల్లా నుంచి ముగ్గురు పశువైద్యాధికారులు ఉత్తరప్రదేశ్‌లని మధురకు వెళ్లారు. అక్కడ ఈ నెల 18న ప్రారంభమైన శిక్షణ శిబిరం శుక్రవారంతో ముగియనుంది. మేకల పెంపకంలో ఆధునిక సాంకేతిక పద్ధతులు, మేకలలో అధిక పాల ఉత్పత్తులను పెంపొందించడానికి అనుసరించాల్సిన విధానాలు, మేకల జాతి పెరుగుదలకు కృత్రిమ గర్భధారణ, సాంకేతికత, పశుగ్రాస వినియోగం, దాణా మిశ్రమాల తయారీ, మేక పాలు, మేకపాల ఉత్పత్తుల ప్రాసెసింగ్ పద్ధతులు వంటి అంశాల్లో అధికారులు శిక్షణ పొందుతున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ జితేష్ వి పాటిల్ మాట్లాడుతూ జిల్లాలో అటవీ ప్రాంతం ఎక్కువగా ఉండడంతో మేకల పెంపకానికి అనుకూల పరిస్థితులు ఉన్నాయని అన్నారు. దీని ద్వారా గిరిజనులు స్థిరమైన జీవనోపాధి పొందేందుకు మంచి అవకాశాలు లభిస్తాయని చెప్పారు. ఆకాంక్షిత జిల్లాగా కేంద్ర ప్రభుత్వం నీతి ఆయోగ్ ద్వారా గుర్తించిన నేపథ్యంలో ఈ శిక్షణ గిరిజనుల ఆర్థికాభివృద్ధికి మరింత దోహదం చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇప్పటికే జిల్లాలో మేకపాలపై అవగాహన కోసం కొత్తగూడెం ఫుడ్ కోర్టులో మేక పాల విక్రయ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు.

ఇళ్ల నిర్మాణాల్లో వేగం పెంచండి

హౌసింగ్ పీడీ రవీంద్రనాథ్



పనులు పరిశీలిస్తున్న రవీంద్రనాథ్

చండ్రుగొండ : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు వేగవంతం చేయాలని హౌసింగ్ పీడీ రవీంద్రనాథ్ సూచించారు. మండలంలోని బెండాలపాడులో నిర్మిస్తున్న ఇళ్లను గురువారం ఆయన పరిశీలించారు. గ్రామానికి 310 ఇళ్లు మంజూరయ్యాయని, అందులో తొలివిడతగా 25 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఆయన వెంట ఏఈ రాము తదితరులు ఉన్నారు.

కౌజు పిట్టల పెంపకంతో ఆర్థికాభివృద్ధి



మాట్లాడుతున్న డీఆర్‌డీఓ విద్యాచందన

కొత్తగూడెంఅర్బన్: కౌజు పిట్టల పెంపకంతో ఆర్థికాభివృద్ధి లభిస్తుందని డీఆర్‌డీఓ విద్యాచందన తెలిపారు. లక్ష్మీదేవిపల్లి మండలం శేషగిరినగర్‌లో పైలట్ ప్రోగ్రామ్‌గా ఏర్పాటుచేసిన కౌజు పిట్టల పెంపకం కేంద్రాన్ని ఆమె గురువారం పరిశీలించి మాట్లాడారు. జిల్లాలోని అన్ని మండలాల్లో ఈ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కౌజు పిట్టల అమ్మకంతో మహిళలకు ఆర్థికంగా నిలదొక్కుకోవచ్చని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఏపీఎంలు, కేంద్రం నిర్వాహకులు పాల్గొన్నారు.

నెమ్మదిగా సాగుతున్న భద్రాచలం కరకట్ట నిర్మాణ పనులు





మూడేళ్లయినా ముడిపడలే..

ఆగుతూ.. సాగుతూ అన్నట్టుగా కరకట్ట పనులు

- 2022లో 71 అడుగుల మేర గోదావరికి భారీ వరద
- నాడు చిగురుటాకుల వణికిన భద్రాద్రి ఏజెన్సీ
- వరద ముప్పు తప్పిస్తామని నాటి సర్కారు హామీలు
- అమలుకు నోచని గత, ప్రస్తుత ప్రభుత్వాల వాగ్దానాలు

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం: గోదావరికి వచ్చే వరదలను రికార్డు చేయడం ప్రారంభించిన తర్వాత అతిపెద్ద వరద 1986లో నమోదైంది. అప్పుడు 27 లక్షల క్యూసెక్కుల నీరు రాగా భద్రాచలం వద్ద 75.60 అడుగుల ఎత్తులో గోదావరి ప్రవహించింది. ఆ తర్వాత అదే స్థాయి వరద 2022లోనూ వచ్చింది. గోదావరి ఎగువ ప్రాంతంలో క్లౌడ్ బరస్ట్ కావడంతో 71.30 అడుగుల ఎత్తులో 24.43 లక్షల క్యూసెక్కుల మేర నీటి ప్రవాహం వచ్చింది. 2022 జూలై 10 నుంచి 16 వరకు దుమ్ముగూడెం, చర్ల, భద్రాచలం, బూర్గంపాడు, అశ్వాపురం, మణుగూరు మండలాలు చిగురుటాకులా వణికిపోయాయి. వరద ప్రభావిత ప్రాంతాల్లో జూలై 17న అప్పటి సీఎం కేసీఆర్ పర్యటించారు. భవిష్యత్‌లో ముంపు సమస్య రాకుండా చూస్తామని హామీ ఇచ్చారు. అయితే ఇప్పటివరకు గత ప్రభుత్వ హామీలు కానీ, ప్రస్తుత సర్కారు చేసిన వాగ్దానాలు కానీ అమలుకు నోచుకోలేదు.

కాంటూర్ లెక్కలేవి..?

1986 వరదలతో పోల్చితే 2022లో వచ్చిన వరద తీవ్రత తక్కువ. పైగా భద్రాచలం పట్టణానికి ఏడు కి.మీ. పొడవున కరకట్ట రక్షణ కూడా ఉంది. అయినప్పటికీ పట్టణంలో సగం ప్రాంతం ముంపునకు గురైంది. లోతట్టు ప్రాంతాలు పూర్తిగా మునిగిపోగా వాటి సమీప కాలనీల్లోని ఇళ్లలో వెంటిలేటర్ల వరకు వరద నీరు చేరింది. దీంతో పోలవరం ప్రాజెక్టు కారణంగా గోదావరి వరద ప్రవాహ తీరులో ఏమైనా మార్పులు వచ్చాయా అని తెలుసుకునేందుకు కాంటూర్ లెవెల్స్‌ను మరోసారి లెక్కించాలని నిర్ణయించారు. గత ప్రభుత్వ హయాంలో అది ఆచరణకు నోచుకోలేదు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ ఏడాది జనవరిలో కాంటూర్ లెవల్స్, పోలవరం ముంపు ప్రభావాన్ని అధ్యయనం చేసే బాధ్యతను సీఎం రేవంత్‌రెడ్డి ఐఐటీ – హైదరాబాద్‌కు అప్పగించారు. ఫిబ్రవరి నాటికి ఈ పని పూర్తి కావాల్సి ఉన్నా.. ఇప్పటికీ నిపుణుల కమిటీ నుంచి ఆశించిన ఫలితాలు రాలేదు. గతంలో అల్పపీడనాలు, తుపానుల కారణంగా గోదావరికి భారీ వరదలు వచ్చేవి. కానీ ఇటీవల క్లౌడ్ బరస్ట్‌లతో కూడా వరద ఉప్పొంగుతోంది. మారిన పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని కొత్తగా కాంటూర్ లెవల్స్‌ను లెక్కించడం, అందుకు తగ్గట్టుగా కొత్త ఫ్లడ్ మాన్యువల్‌ను రూపొందించుకోవాల్సిన అవసరముంది.

రాకపోకలకు ఇబ్బంది

గోదావరి వరద రెండో ప్రమాద హెచ్చరిక 48 అడుగుల నుంచి మూడో ప్రమాద హెచ్చరిక 53 అడుగులకు చేరుకునేలోపు బూర్గంపాడు – సారపాక, దుమ్ముగూడెం – భద్రాచలం, కూనవరం – భద్రాచలం మధ్య వరద నీరు ప్రధాన రహదారిపైకి వచ్చి రాకపోకలు నిలిచిపోతాయి. 53 అడుగుల నుంచి వరద పైకి పోయే కొద్దీ ఇతర ప్రాంతాల్లోనూ రాకపోకలు స్తంభించడం పెరుగుతుంది. దీంతో బూర్గంపాడు – సారపాక, చర్ల – భద్రాచలం మధ్య ఉన్న రహదారుల్లో హై లెవల్ వంతెనలు నిర్మించాలనే డిమాండ్ ఎప్పటి నుంచో ఉన్నా.. అది నెరవేరడం లేదు సరికదా కనీసం సాధారణ పనులు కూడా సకాలంలో జరగడం లేదు. దుమ్ముగూడెం – భద్రాచలం మార్గంలో తూరుబాక వద్ద కుంగిన వంతెన స్థానంలో కొత్త వంతెన నిర్మాణం ఏడాది క్రితం ప్రారంభమైంది. ఈ ఏడాది శ్రీరామ నవమి నాటికే ఈ వంతెన నిర్మాణం పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశించారు. అయినా ఇప్పటికీ ఆ పని పూర్తి కాలేదు. చివరకు 45 అడుగుల వరదకే ఈ వంతెన దగ్గర అప్రోచ్ రోడ్ మునిగిపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి.

కరకట్టల సంగతీ అంతే..

పోలవరం, సీతారామ ప్రాజెక్టులతో తీర ప్రాంతాల్లో ఎలాంటి ముంపు సమస్య రాకుండా జిల్లా వ్యాప్తంగా గోదావరి నదికి ఇరువైపులా భారీ కరకట్టలు నిర్మించాలని గత ప్రభుత్వ హయాంలో నిర్ణయించారు. చర్ల, దుమ్ముగూడెం మండలాల్లో కొంత మేరకు పనులు కూడా జరిగాయి. కానీ సీతమ్మ సాగర్‌కు అనుమతులు రాకపోవడంతో ఈ పనులు అర్ధంతరంగా ఆగిపోయాయి. దీంతో 48 అడుగల మేర వరద వస్తే బూర్గంపాడు, దుమ్ముగూడెం మండలాల్లో వందలాది ఎకరాల్లో పంటలు మునిగిపోతున్నాయి. సీతమ్మ సాగర్‌కు త్వరగా అనుమతులు సాధించి కరకట్టల నిర్మాణం చేపడితేనే ముంపు నుంచి జిల్లా రైతులకు భరోసా లభిస్తుంది. మరోవైపు ప్రజాపాలన ఆరంభంలో చకచకా జరిగిన భద్రాచలం కరకట్ట (కూనవరం రోడ్డు) పనులు ఆ తర్వాత ఆగుతూ.. సాగుతూ అన్నట్టుగా మారాయి. పనులు మొదలై రెండు సీజన్లు గడిచినా నేటికీ కొలిక్కి రాలేదు.

నిలకడగా గోదావరి



గోదావరి బ్రిడ్జిని అనుకుని ప్రవహిస్తున్న వరద (ఇన్‌సెట్) సాయంత్రం 5 గంటలకు 51.90 అడుగులకు వచ్చిన వరద



వారం తర్వాత మళ్లీ పెరిగే అవకాశం !

భద్రాచలంఅర్బన్ : భద్రాచలం వద్ద గోదావరి నీటి మట్టం గురువారం సాయంత్రం నుంచి నిలకడగా ఉంది. బుధవారం ఒక్కసారిగా పెరగడంతో ఒక్క రోజే మొదటి, రెండో ప్రమాద హెచ్చరికలు జారీ అయిన విషయం తెలిసిందే. ఇక గురువారం తెల్లవారుజామున 5 గంటలకు 50 అడుగులు, 7 గంటలకు 50.60 అడుగులు, 10 గంటలకు 51.10 అడుగులకు చేరుకుని, ఆ తర్వాత నెమ్మదిగా పెరుగుతూ సాయంత్రం 4 గంటలకు 51.90 అడుగులుగా నమోదైంది. అప్పటి నుంచి రాత్రి 11 గంటలకు వరకు అదే ప్రవాహం కొనసాగింది.

వీడిన భయాందోళనలు..

గోదావరి నీటిమట్టం బుధవారం భారీగా పెరగడంతో గురువారం కూడా ప్రభావం చూపుతుందని, మూడో ప్రమాద హెచ్చరిక జారీ అవుతుందని అందరూ భావించారు. తీరప్రాంత ప్రజలు భయాందోళనకు గురయ్యారు. కానీ సాయంత్రం నుంచి నీటిమట్టం నిలకడగా ఉండడంతో స్థానికులతో పాటు అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు వరద నెమ్మదిగా తగ్గుతుందని, 9 గంటల తర్వాత వేగంగా తగ్గే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే.. ప్రస్తుతం భద్రాచలం వద్ద గోదావరి వరద నీరు తగ్గినా మహారాష్ట్రలో ఇటీవల కురిసిన వర్షాలతో అక్కడి నుంచి వరద ప్రవాహం వారం రోజుల తర్వాత భద్రాచలం చేరుకుంటుందని, అప్పుడే మళ్లీ వరద పెరిగే ప్రమాదం ఉందని అంటున్నారు.

వరద ఉధృతి పరిశీలన..

భద్రాచలం వద్ద గోదావరి వరద ఉధృతిని సబ్ కలెక్టర్ మ్రిణాల్ శ్రేష్ఠ, ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు పరిశీలించారు. స్లూయిస్‌ల పనితీరు తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వరదల కారణంగా సీజనల్ వ్యాధులు సోకకుండా తగు చర్యలు చేపట్టాలని వైద్యారోగ్య శాఖ అధికారులను ఆదేశించారు.

బియ్యంతో పాటు సంచులు..

జిల్లాలో పంపిణీకి సిద్ధంగా 2.93లక్షల బ్యాగులు



సీఎం, మంత్రుల ఫొటోలతో కూడిన సంచి

పాల్వంచరూరల్ : బియ్యం కోసం రేషన్ షాపులకు వెళ్లేవారు ఇకపై బస్తాలు, సంచులు తీసుకెళ్లాల్సిన పని లేదు. వచ్చే నెల నుంచి ప్రభుత్వమే ఉచితంగా సంచులు సరఫరా చేస్తుంది. ఈ మేరకు సంచిపై 'అందరికీ సన్నబియ్యం ప్రజా ప్రభుత్వంతోనే సాధ్యం' అని రాయడంతో పాటు రేవంత్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్ రెడ్డి, మల్లు భట్టి విక్రమార్కల ఫొటోలు ముద్రించి సిద్ధంగా ఉన్నాయి. 13 ఏళ్ల క్రితం అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఇలా సంచులు పంపిణీ చేసిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ప్రభుత్వం అందించే సంచి ఒక్కోటి రూ.50 విలువ చేస్తుందని చెబుతున్నారు. జిల్లాలోని వినియోగదారుల కోసం 2.93 లక్షల బ్యాగులు రాగా, గోదాముల్లో నిల్వ చేశారు.

'ఎర్త్ సైన్సెస్'లో స్పాట్ అడ్మిషన్లు

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెంలోని డాక్టర్ మన్మోహన్‌సింగ్ ఎర్త్ సైన్సెస్ యూనివర్సిటీలో ఈ ఏడాది నుంచే తరగతులు ప్రారంభించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ క్రమంలో దోస్త్ నుంచి అడ్మిషన్లు కాగా, స్పాట్ అడ్మిషన్లు కూడా చేపట్టనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ జగన్మోహన రాజు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. బీఎస్సీ(జియాలజీ), బీఎస్సీ(ఎన్విరాన్‌మెంటల్ సైన్స్) విభాగాల్లో స్పాట్ అడ్మిషన్లు జరుగనున్నాయని పేర్కొన్నారు. ఇందుకోసం ఆసక్తి గలవారు ఈనెల 26లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు 85003 78531 నంబర్‌లో సంప్రదించాలన్నారు.

ఏటీసీలతో నైపుణ్యాలు మెరుగు

కలెక్టర్ జితేష్ వి పాటిల్ వెల్లడి



సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

బూర్గంపాడు: యువతలో వృత్తి విద్యా నైపుణ్యాలు మెరుగుపరిచేందుకు అడ్వాన్స్‌డ్ ట్రెయినింగ్ సెంటర్లు (ఏటీసీ) ఉపయోగపడతాయని కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. కృష్ణసాగర్ ప్రభుత్వ ఐటీఐలో ఏర్పాటు చేసిన ఏటీసీని గురువారం ఆయన పరిశీలించారు. శిక్షణ పొందుతున్న విద్యార్థులతో మాట్లాడారు. ఏటీసీలో శిక్షణ పొంది నైపుణ్యాలు పెంచుకుంటే మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు. పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా శిక్షణ అందిస్తున్నారని చెప్పారు. తరగతి గదుల్లో అందుబాటులో ఉన్న స్మార్ట్‌బోర్డులను, డిజిటల్ లెర్నింగ్ సిస్టమ్స్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏటీసీల్లో పలు ఆధునిక కోర్సులు అందుబాటులో ఉన్నాయని, పదో తరగతి ఉత్తీర్ణులైన వారు ఈ కోర్సుల్లో చేరి వృత్తి విద్యా నైపుణ్యాలు పెంపొందించుకోవాలని పిలుపునిచ్చారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

కొత్తగూడెంఅర్బన్: ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చే వారికి మెరుగైన వైద్య సేవలు అందించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ వైద్యాధికారులకు సూచించారు. కొత్తగూడెం ప్రభుత్వ ఆస్పత్రిని గురువారం ఆయన తనిఖీ చేశారు. రక్త పరీక్ష కేంద్రం, ఇన్ పేషెంట్ వార్డు, గర్భిణుల వార్డు, మందుల స్టోర్ రూమ్‌ను పరిశీలించారు. ఇన్ పేషెంట్లతో మాట్లాడి వైద్య సేవలు ఎలా అందుతున్నాయని ఆరా తీశారు. రోగులకు మెరుగైన చికిత్స అందించాలని, వైద్యులు, సిబ్బంది 24 గంటలూ అందుబాటులో ఉండాలని ఆదేశించారు. ఆస్పత్రిని పరిశుభ్రంగా ఉంచాలని, అవసరమైన మందులు నిల్వ ఉంచాలని అన్నారు. పేషెంట్లకు శుచికరమైన, బలవర్ధకమైన ఆహారం అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఆస్పత్రి సూపరింటెండెంట రాధామోహన్ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులను ఆస్పత్రులకు తరలించాలి

డీఎంహెచ్‌ఓ జయలక్ష్మి



గర్భిణుల కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న జయలక్ష్మి

భద్రాచలంఅర్బన్ : గోదావరి తీర ప్రాంతాలకు చెందిన గర్భిణులను ముందుగానే గుర్తించి ప్రభుత్వ ఆస్పత్రులకు తరలించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ జయలక్ష్మి సిబ్బందికి సూచించారు. వరద ఉధృతి నేపథ్యంలో హైరిస్క్ ఉండే గర్భిణులపై ప్రత్యేక దృష్టి సారించాలని అన్నారు. ముంపు ప్రాంతాల నుంచి ఇప్పటికే 20 మంది గర్భిణులను భద్రాచలం ఏరియా ఆస్పత్రికి తరలించి, ప్రత్యేక వార్డులో వైద్యం అందిస్తున్నారు. వీరిలో భద్రాచలం నుంచి 15 మంది, మణుగూరు, చర్ల నుంచి ఐదుగురు ఉన్నారు. ఈ క్రమంలో డీఎంహెచ్‌ఓ గురువారం వారిని పరామర్శించి, అందుతున్న సేవలపై ఆరా తీశారు. అనంతరం మాట్లాడుతూ.. చికిత్స సమయంలో ఏదైనా సమస్య ఎదురైతే తనను సంప్రదించాలని సిబ్బందిని ఆదేశించారు. అలాగే వైద్యులకు సమాచారం ఇవ్వకుండా ఆస్పత్రి నుంచి ఎవరూ ఇళ్లకు వెళ్లొద్దని గర్భిణులకు, వారి కుటుంబసభ్యులకు సూచించారు. కార్యక్రమంలో భద్రాచలం డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ చైతన్య, ఏరియా ఆస్పత్రి సిబ్బంది రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైద్యసేవలు మెరుగుపర్చాలి

అసిస్టెంట్ కలెక్టర్ సౌరభ్ శర్మ



దేవగుంపులో మాట్లాడుతున్న సౌరభ్ శర్మ

బూర్గంపాడు: మారుమూల గ్రామీణ ప్రాంతాల్లో వైద్యసేవలు మరింతగా మెరుగుపర్చాలని అసిస్టెంట్ కలెక్టర్ సౌరభ్ శర్మ సూచించారు. మోరంపల్లిబంజర పీహెచ్‌సీని, లక్ష్మీపురం ఆరోగ్య ఉపకేంద్రాన్ని, దేవగుంపు గొత్తికోయ గ్రామాన్ని గురువారం ఆయన సందర్శించారు. పీహెచ్‌సీలు, హెల్త్ సబ్‌సెంటర్లలో అందిస్తున్న వైద్యసేవలపై ఆరా తీశారు. ఫ్రంట్‌లైన్ హెల్త్ వర్కర్లతో మాట్లాడుతూ.. గ్రామాల్లో వైద్యసేవలు ఎలా అందిస్తున్నారని అడిగి తెలుసుకున్నారు. దేవగుంపులో ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య పరిస్థితులపై ఆరా తీశారు. ప్రభుత్వపరంగా వైద్యసేవలు అందించేందుకు గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు వైద్యారోగ్యశాఖకు పటిష్టమైన వ్యవస్థ ఉందన్నారు. సీజనల్ వ్యాధులు గుర్తించడానికి కూడా ఈ వ్యవస్థ ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో వైద్యులు స్పందన, లక్ష్మీసాహితి, లలిత తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి'కి వేళాయె..

- గ్రామాల్లో ఈజీఎస్ పనులకు నేడు శ్రీకారం
- ప్రారంభించనున్న స్థానిక ఎమ్మెల్యేలు
- ప్రజలకు మేలు జరిగే పనులకు స్థానం
- ఏర్పాట్లు చేసిన డీఆర్‌డీఏ అధికారులు



ఉపాధి పనులు చేస్తున్న కూలీలు (ఫైల్)

చుంచుపల్లి : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా పల్లెల్లో నివసించే పేదలకు 100 రోజులు పని కల్పిస్తూ ఆర్థిక భరోసా నింపుతుండగా.. పనులు సకాలంలో పూర్తి చేసే బాధ్యతను సంబంధిత అధికారులు తీసుకుంటున్నారు. ఈ సంవత్సరం కూడా గ్రామీణ ప్రాంత కూలీలకు ఉపాధి కల్పించేందుకు పనుల జాతర పేరుతో ప్రభుత్వం ముందుకొచ్చింది. ఈ మేరకు అన్ని గ్రామాల్లో శుక్రవారం స్థానిక ఎమ్మెల్యేలు, అధికారులు ఏకకాలంలో పనులు ప్రారంభిస్తారు. ఇందు కోసం అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, ఇంజనీరింగ్, స్వచ్ఛభారత్ మిషన్, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలు పనుల్లో భాగస్వాములు కానున్నాయి. చేపట్టనున్న పనులు, కూలీల పని దినాలు, బడ్జెట్ కేటాయింపు ప్రణాళికలను డీఆర్‌డీఏ అధికారులు సిద్ధం చేశారు.

అందరికీ ఉపయోగపడేలా..

ప్రభుత్వం నిర్వహిస్తున్న పనుల జాతర కార్యక్రమంలో ప్రధానంగా ప్రజలకు, రైతులకు ఉపయోగపడే పనులకు ప్రాధాన్యత కల్పిస్తున్నారు. ముఖ్యంగా పశువుల షెడ్లు, కోళ్ల ఫారాలు, వర్మీ కంపోస్టు తయారీ పనులు, నర్సరీలు, నాడెపు కంపోస్టు పిట్, అజోలా తయారీ, ఇంకుడు గుంతలు, జలనిధి ద్వారా చెక్ డ్యాంల నిర్మాణం, వ్యవసాయ బావులు, వర్షం నీటిని ఒడిసిపట్టే నిర్మాణాలు, అంగన్‌వాడీ భవనాలు, సీసీ రోడ్లు, బిందు సేద్యం, ఫామ్ పాండ్స్, గతంలో నిర్మించిన రోడ్లు దెబ్బ తింటే మరమ్మతులు వంటివి చేపట్టనున్నారు. అంతేకాక పొలాల వద్దకు ఉన్న కాలిబాటలను అభివృద్ధి చేయడంతో రైతులకు మేలు జరగనుంది. ప్రస్తుతం అన్ని గ్రామాల్లో పనులు గుర్తించిన అధికారులు.. ఉపాధి హామీ నిధుల ద్వారా త్వరితగతిన పూర్తి చేసేలా చూస్తున్నారు. పనుల జాతరలో చేపట్టనున్న ఉపాధి పనులన్నీ 2026 మార్చి నాటికి పూర్తి చేయాలని నిర్ణయించారు. ఇక శుక్రవారం జరిగే పనుల జాతర కార్యక్రమంలో ఆర్థిక సంవత్సరంలో కొత్తగా చేపట్టబోయే నూతన భవన నిర్మాణాలు, ప్లాస్టిక్ వేస్ట్ యూనిట్, గ్రామీణ రహదారుల నిర్మాణం వంటి పనులకు శంకుస్థాపనలు చేస్తారు. ఇప్పటికే పూర్తయిన పనులుంటే ప్రారంభోత్సవాలు చేస్తారు. జిల్లాలో మొత్తం 4,002 పనులకు రూ.3779.72 లక్షలు కేటాయించారు. దాంతో పాటు గతేడాది ఎక్కువ రోజులు పని దినాలు పూర్తి చేసిన దివ్యాంగులు, నిబద్ధతతో పనిచేసిన పారిశుద్ధ్య కార్మికులను, పచ్చదనం పెంపునకు కృషి చేసిన వారిని సన్మానించనున్నారు.

జిల్లాలో 4.53 లక్షల మంది కూలీలు..

జిల్లా వ్యాప్తంగా 2.21 లక్షల జాబ్‌కార్డులు ఉండగా, వాటి పరిధిలో 4.53లక్షల మంది కూలీలు పేరు నమోదు చేసుకున్నారు. పనుల జాతరలో భాగంగా ఈ ఆర్థిక సంవత్సరం జిల్లాలో 26.21 లక్షల పనిదినాలు కల్పించాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందులో ఇప్పటి వరకు 23.75 లక్షల పని దినాలు పూర్తి చేశారు. ఇప్పటివరకు చేపట్టిన పనులకు రూ.91.10 కోట్లు ఖర్చు చేశారు. ప్రతి ఏడాది ఫిబ్రవరి నుంచి జూన్ వరకు జరిగే పనులను ఉపాధి కూలీలు ఎక్కువ సంఖ్యలో సద్వినియోగం చేసుకుంటారు.

ప్రజలకు మేలు జరిగేలా



రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు శుక్రవారం జిల్లాలో పనుల జాతరను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశాం. ఆ రోజున స్థానిక ఎమ్మెల్యేలతో కార్యక్రమాన్ని ప్రారంభించాలని నిర్ణయించాం. పనుల జాతరలో గ్రామస్తులు, రైతులకు మేలు జరిగేలా పనులు చేపట్టేందుకు ప్రణాళికలు సిద్ధం చేశాం. కూలీలకు చేతి నిండా పని కల్పించడంతో పాటు గ్రామాల అభివృద్ధికి ఇవి దోహదపడనున్నాయి.

– ఎం.విద్యాచందన, డీఆర్‌డీఓ

అశ్వాపురం : మొండికుంట - భద్రాచలం రహదారిపై నిలిచిన నీరు



చర్ల : తేగడ వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న వరద



దుమ్ముగూడెం : పర్ణశాల రహదారి పైకి చేరిన వరద నీరు



పడవపై సున్నంబట్టి గ్రామానికి వెళ్తున్న దుమ్ముగూడెం తహసీల్దార్ తదితరులు



రోడ్లన్నీ చెరువులాయె !

రెండు రోజులుగా గోదావరి వరద ఉధృతం కావడంతో పలుచోట్ల రహదారులపైకి నీరు చేరింది. దీంతో రోడ్లన్నీ చెరువులను తలపిస్తున్నాయి. పలు గ్రామాల మధ్య రాకపోకలకు తీవ్ర అంతరాయం కాగా, పంటలకూ నష్టం వాటిల్లింది. చర్ల మండలంలోని తేగడ వద్ద తాలిపేరు ఉధృతితో దండుపేట, గుంపెన్నగూడెం, కేశవాపురం, తేగడ, కుదునూరు, దేవరాపల్లి, మేడివాయి గ్రామాలు జలదిగ్బంధం అయ్యాయి. దుమ్ముగూడెం మండలం సున్నంబట్టి - బైరాగులపాడు రహదారిపైకి భారీగా వరద నీరు చేరగా గ్రామస్తులు పడవలపై రాకపోకలు సాగిస్తున్నారు. బుర్రవేముల వద్ద చర్ల - భద్రాచలం ప్రధాన రహదారిపైకి వరద నీరు చేరింది. అశ్వాపురం మండలం బట్టమల్లయ్యగుంపు - రాంనగర్, అమెర్ద - అమ్మగారిపల్లి, మొండికుంట - భద్రాచలం రహదారులపైనా వరదనీరు చేరి రాకపోకలు నిలిచాయి.

– చర్ల/దుమ్ముగూడెం/అశ్వాపురం

క్లుప్తంగా

జాలర్లకు చిక్కిన వింత చేప



వింత చేపతో జాలరులు

పినపాక: మండలంలోని చింతల బయ్యారంలో వరద ఉధృతి పెరగడంతో గురువారం జాలర్లు చేపలు వేటాడారు. ఈక్రమంలో వలలో వింత చేప చిక్కింది. మామూలు చేపకు భిన్నంగా నోరు, రంగు ఉండగా.. శరీరం మొత్తం ముళ్లతో ఉండడంతో గ్రామస్తులు ఆసక్తిగా తిలకించారు.

జిల్లాకు సీతారామ నీరందించాలి

సీపీఐ రాష్ట్ర మహాసభల్లో తీర్మానం



మాట్లాడుతున్న సాబీర్‌పాషా

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాకు సీతారామ ప్రాజెక్టు నీరందించాలని, ఇక్కడి రైతులకు ఉపయోగపడేలా కాల్వలు నిర్మించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్‌పాషా అన్నారు. మేడ్చల్ జిల్లాలోని గాజుల రామారంలో జరుగుతున్న సీపీఐ రాష్ట్ర మహాసభల్లో రెండో రోజైన గురువారం ఈ మేరకు ఆయన తీర్మానం ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లాలోని ఐదు నియోజకవర్గాల రైతులకు సీతారామ ప్రాజెక్టు నీటిని మళ్లించి సస్యశ్యామలం చేయాలన్నారు.

గోదా‘వర్రీ’..!



సారపాక, బూర్గంపాడు రోడ్డుపైకి వచ్చిన గోదావరి వరద నీరు

వరద నీటిలో మునిగిన పంటచేలు

- రహదారులపైకి చేరిన వరద
- బూర్గంపాడు – భద్రాచలం మధ్య నిలిచిన రాకపోకలు
- లోతట్టు ప్రాంతాల్లో ఇళ్లలోకి చేరిన నీరు

బూర్గంపాడు: గోదారి కన్నెర్రజేసింది. ఈ ఏడాది వరదలు ఉండవని భావించి పంటలు సాగు చేసిన రైతులను కన్నీటి పాలు జేసింది. మొన్నటి వరకు ఇసుక తిన్నెలతో కనిపించిన గోదావరి ఇటీవల కురిసిన వర్షాలకు ఒక్కసారిగా ఉప్పొంగింది. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో నదిలోకి భారీగా వరద చేరుతోంది. గురువారం సాయంత్రానికి 52 అడుగులు దాటి మూడో ప్రమాద హెచ్చరికకు చేరువవుతున్న గోదావరి వరదకు భద్రాచలం రెవెన్యూ డివిజన్‌లో వందల ఎకరాల్లో పంటలు నీటమునిగాయి. రహదారులపైకి నీరు చేరడంతో రాకపోకలు నిలిచిపోయాయి. బూర్గంపాడులో కొన్ని ఇళ్లలోకి వరదనీరు చేరగా.. నిర్వాసితులను పునరావాస కేంద్రాలకు తరలించారు.

నష్టం మరింత పెరిగేనా..?

గోదావరి పరీవాహక ప్రాంత రైతులు వరదలతో వణికిపోతున్నారు. ఈ ఏడాది వరదలు ఉండవని భావించి పంటలు సాగు చేశారు. పత్తి, వరి, కూరగాయల పంటలు సాగు చేసి, పైపాట్లు చేసి ఎరువులు కూడా వేశారు. ఈ తరుణంలో వచ్చిన గోదావరి వరదలు బూర్గంపాడు, అశ్వాపురం, దుమ్ముగూడెం, చర్ల మండలాల్లో సుమారు 3వేల ఎకరాల్లో పంటలను నీటముంచాయి. భద్రాచలం వద్ద గోదావరి వరద మూడో ప్రమాద హెచ్చరికకు చేరువలో ఉన్న తరుణంలో పంట నష్టం మరింతగా పెరుగుతుందని ఆందోళన చెందుతున్నారు. పత్తి పంటకు ఇప్పటికే రైతులు రెండుసార్లు ఎరువులు వేసుకుని సస్యరక్షణ మందులు పిచికారీ చేశారు. ఈ తరుణంలో మొక్కలు నీటమునగటంతో రైతులు తల పట్టుకుంటున్నారు. ఇటీవల వేసిన వరినాట్లు కూడా వరద ముంపునకు గురికావడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. వరదలతో పంటలతో పాటు రైతులు వాగుల వద్ద ఏర్పాటు చేసుకున్న విద్యుత్ మోటార్లు, డీజిల్ ఇంజన్లు సైతం నీటమునిగాయి.



రెడ్డిపాలెం పెద్దవాగు వద్ద నీటమునిగిన పత్తిచేలు

పునరావాస కేంద్రాలకు తరలింపు..

గోదావరి వరదలతో బూర్గంపాడులోని మిల్లు సెంటర్, కొల్లుచెరువు ప్రాంతాల్లోని కొన్ని ఇళ్లలోకి వరద నీరు చేరింది. దీంతో బాధిత కుటుంబాలను అధికారులు పునరావాస కేంద్రాలకు తరలించారు. బూర్గంపాడులోని కేజీబీవీలో పునరావాస కేంద్రం ఏర్పాటు చేశారు. గోదావరి వరద ప్రభావిత ప్రాంతాలను అధికారులు పరిశీలిస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. పాల్వంచ డీఎస్పీ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో బూర్గంపాడు మండలంలో ఎస్‌ఐలు మేడ ప్రసాద్, నాగభిక్షం వరద ముంపు ప్రాంతాల్లో బందోబస్తు చేపట్టారు. బూర్గంపాడు తహసీల్దార్ కేఆర్‌కేవీ ప్రసాద్, ఎంపీడీఓ జమలారెడ్డి, ఎంపీఓ బాలయ్య ముంపు గ్రామాల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేసి బాధితులకు అవసరమైన చర్యలు చేపడుతున్నారు.

నిలిచిన రాకపోకలు..

గోదావరి వరదలకు బూర్గంపాడు – భద్రాచలం మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. బూర్గంపాడు సమీపంలోని పులితేరు, సారపాక సమీపంలోని పెదవాగు బ్రిడ్జి, రెడ్డిపాలెంలోని చర్చి స్కూల్ వద్ద గోదావరి వరద ఆర్‌అండ్‌బీ రహదారిపైకి చేరడంతో ఈ మార్గంలో రాకపోకలకు అంతరాయం వాటిల్లింది. భద్రాచలం నుంచి దుమ్ముగూడెం, చర్ల వెళ్లే రోడ్లపైకీ వరదనీరు చేరడంతో అటువైపు కూడా రాకపోకలు నిలిచిపోయాయి. భద్రాచలం నుంచి కూనవరం వెళ్లే రహదారిలో కూడా కొన్నిచోట్ల వరద నీరు రోడ్లపైకి చేరటంతో రాకపోకలను నిలిపివేశారు. గోదావరి వరద నీరు రోడ్లపైకి చేరడంతో అటుగా ఎవరూ ప్రయాణించకుండా పోలీస్, రెవెన్యూ శాఖలు చర్యలు చేపట్టాయి. ముంపు ప్రాంతాల్లో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి వాహనాల రాకపోకలను నిలిపివేశారు.

గంజాయి, మారణాయుధాల పట్టివేత



వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ జనార్దన్ రెడ్డి



స్వాధీనం చేసుకున్న ఆయుధాలు

- ముగ్గురిని అరెస్ట్ చేసిన పోలీసులు.. మరొకరు పరార్
- పిస్టల్, 5 రివాల్వర్లు, 40 బుల్లెట్లు, 12 ఖాళీ మ్యాగజైన్లు స్వాధీనం
- నిందితులు తమిళనాడు, కేరళ రాష్ట్రాల వారుగా గుర్తింపు

పాల్వంచ: అక్రమంగా తరలిస్తున్న గంజాయిని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు పట్టుకోగా, నిందితుల నుంచి మారణాయుధాలను స్వాధీనం చేసుకున్న ఘటన పాల్వంచలో చోటుచేసుకుంది. ఈ మేరకు ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ జి.జనార్దన్ రెడ్డి గురువారం మీడియాకు వివరాలు వెల్లడించారు. విశ్వసనీయ సమాచారం మేరకు బుధవారం రాత్రి పాల్వంచలో వాహనాల తనిఖీ చేపట్టామని, అనుమానాస్పదంగా కనిపించిన ఐచర్ వ్యాన్, వోక్స్ వ్యాగన్ పోలో కారును తనిఖీ చేయగా ఆయా వాహనాల్లో రూ.53లక్షల విలువ చేసే 105 కేజీల గంజాయితో పాటు ఒక పిస్టల్, ఐదు రివాల్వర్లు, 40 బుల్లెట్లు, 12 ఖాళీ మ్యాగజైన్లు లభ్యమయ్యాయని చెప్పారు. వ్యాన్, కారుతో పాటు ముగ్గురిని అదుపులోకి తీసుకోగా, మరొకరు తప్పించుకుని పరారయ్యాడని తెలిపారు. నిందితుల్లో కేరళ రాష్ట్రంలోని ఎర్నాకుళం జిల్లా అలువాకు చెందిన బీలాల్ వి.ఎస్, తమిళనాడు రాష్ట్రం తిరుచ్చి జిల్లా తిరియర్‌కు చెందిన శ్యాం సుందర్, విశ్వాంబల్ సముద్రమ్ గ్రామానికి చెందిన కాశీ నందన్ సంతోష్ ఉన్నారని గుర్తించామని, అంతేగాక తిరుచ్చికి చెందిన జేమ్స్ అనే వ్యక్తి పరారీలో ఉన్నాడని వివరించారు. ఒడిశా నుంచి భద్రాచలం, ఖమ్మం, చెన్నై మీదుగా తిరుచ్చికి గంజాయి తరలిస్తున్నట్లు గుర్తించామని, తదుపరి విచారణ నిమిత్తం వారిని పాల్వంచ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించామని చెప్పారు. అక్కడ విచారణ అనంతరం జ్యుడీషియల్ రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించామని తెలిపారు. నిందితులను చాకచక్యంగా పట్టుకున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమిషనర్ జి.గణేష్, ఇన్‌స్పెక్టర్ ఎస్.రమేష్, సబ్ ఇన్‌స్పెక్టర్ సీహెచ్.శ్రీహరి రావు, సిబ్బంది ఖరీం, బాలు, సుధీర్, వెంకటేశ్వర్లు, హనుమంతరావు, విజయ్, హరీష్, వీరబాబు, ఉపేందర్‌ను జనార్దన్‌రెడ్డి అభినందించారు. కాగా, ఈ నలుగురిపై భారత ఆయుధ చట్టం కింద కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

నిందితులది మొదటి నుంచీ నేరచరితే..

గంజాయి, మారణాయుధాలతో పట్టుబడిన నిందితులు కేరళలో గ్యాంగ్‌స్టర్ టీంగా చెలామణి అవుతున్నారని, కొచ్చిలో గ్యాంగ్‌స్టర్ బిలాల్‌పై 100కు పైగా కేసులు ఉండగా 28 సార్లు శిక్ష అనుభవించాడని తెలిసింది. ఎనిమిదేళ్ల శిక్ష అనంతరం ఇటీవలే విడుదలై మళ్లీ నేరాలకు పాల్పడేందుకు మధ్యప్రదేశ్‌లో మారణాయుధాలు కొనుగోలు చేశాడు. రెండో నిందితుడైన తమిళనాడుకు చెందిన శ్యాం సుందర్‌కు గంజాయి వ్యాపారంలో ఆరితేరిన వ్యక్తిగా పేరుంది. ప్రస్తుతం అతడు డ్రైవర్‌గా వచ్చాడు. తమిళనాడుకు చెందిన జేమ్స్‌కు కూడా భారీ నేర చరిత్ర ఉన్నట్లు సమాచారం.

ఎన్డీలో బహిష్కరణల పర్వం

- అశోక్‌పై వేటు వేసిన చంద్రన్న
- చంద్రన్నను బహిష్కరించిన అశోక్

ఇల్లెందు: ఇల్లెందు కేంద్రంగా బలమైన ఉద్యమం కలిగిన సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీలో మరో చీలిక ఏర్పడింది. తాజాగా ఆ పార్టీ కేంద్ర, రాష్ట్ర కార్యదర్శులు పరస్పరం బహిష్కరించుకుంటూ ప్రకటనలు విడుదల చేయడం చర్చనీయాంశంగా మారింది. ఎన్డీ కేంద్ర కార్యదర్శి పెద్ద చంద్రన్న ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి అశోక్‌ను బహిష్కరించినట్లు ప్రకటన విడుదల చేసిన గంటల వ్యవధిలోనే చంద్రన్నను బహిష్కరిస్తున్నట్లు అశోక్ మరో ప్రకటన విడుదల చేశారు. దీంతో చంద్రన్న – అశోక్ వర్గాల్లో పరస్పరం బహిష్కరణల పర్వం సాగుతోంది. ఒకప్పుడు ఇల్లెందులో బలంగా ఉన్న ఎన్డీ.. చంద్రన్న – వైకే వర్గాలుగా విడిపోయాయి. అంతకుముందు ఎన్డీ నుంచి పోటు రంగారావు విడిపోయి మాస్‌లైన్‌గా మార్చుకున్నారు. తాజాగా చంద్రన్న వర్గం మరో చీలికకు దారి తీసింది. ఏడాది క్రితం చంద్రన్న వర్గం నుంచి సాధినేని వెంకటేశ్వరరావు, గోవర్ధన్, చిట్టిపాటి వెంకటేశ్వర్లు, సంధ్య విడిపోయి కొద్దికాలం తర్వాత వైకే వర్గంలో కలిశారు. ఇలా జరిగిన ఏడాది కాలంలోనే మళ్లీ చంద్రన్న వర్గంలో మరో చీలిక రావడంతో ఆ పార్టీ మూడు ముక్కలాటగా మారింది.

2011 నుంచి చీలికలు..

ఒకప్పుడు ఇల్లెందు కేంద్రంగా ఆరు దఫాలుగా ఆ పార్టీ అభ్యర్థులు ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. ఇక్కడి నుంచి చాపల ఎర్రయ్య, గుమ్మడి నర్సయ్య అసెంబ్లీకి ప్రాతినిధ్యం వహించారు. అయితే 2011 నుంచి పార్టీలో చీలికలు మొదలయ్యాయి. తొలుత ఎన్డీ రాయల బోస్ – వైకేలు ఒక వర్గంగా, చంద్రన్న – సాధినేని వెంకటేశ్వర్లు మరో వర్గంగా విడిపోయారు. 2022లో రాయల బోస్ – వైకేల నుంచి పోటు రంగారావు – డీవీకేలు ఒక వర్గంగా విడిపోయి ప్రజాపంథాగా ఆవిర్భవించారు. ఇదే వర్గం గతేడాది కేంద్ర కార్యదర్శి ప్రదీప్ సింగ్ ఠాగూర్‌తో కలిసి మాస్‌లైన్‌గా ఏర్పడ్డారు. వైకే నేతృత్వంలోని మరో వర్గం రాష్ట్ర కార్యదర్శిగా సూర్యంను ఎన్నుకుంది. ఇక చంద్రన్న వర్గం నుంచి ఏడాది క్రితం సాధినేని వెంకటేశ్వర్లు, గోవర్ధన్, చిట్టిపాటి, సంధ్య బయటకు వచ్చి వైకే – సూర్యం వర్గంతో కలిశారు. తాజాగా చంద్రన్న వర్గం నుంచి అశోక్ మరో వర్గంగా బయటకు వచ్చి సొంత కుంపటి పెట్టుకున్నారు. ప్రస్తుతం ఇల్లెందు ఏరియాలో ఎన్డీలో మూడు వర్గాలు ఏర్పడ్డాయి.

గోడౌన్‌లో భారీగా మంటలు



గోడౌన్‌లో భారీగా ఎగసిపడుతున్న మంటలు

- దగ్ధమైన బ్లీచింగ్ పౌడర్, పండ్లు
- రూ. 4 లక్షల ఆస్తి నష్టం

భద్రాచలంఅర్బన్ : భద్రాచలంలోని పాత మార్కెట్ గోడౌన్ (నెహ్రూ మార్కెట్)లో గురువారం తెల్లవారుజామున 5 గంటల సమయంలో మంటలు చెలరేగాయి. దీంతో బ్లీచింగ్ పౌడర్ బస్తాలతో పాటు పలువురు వ్యాపారులకు చెందిన పండ్లు పూర్తిగా కాలి బూడిదయ్యాయి. స్థానికులు అగ్నిమాపక శాఖకు సమాచారం అందించగా, అక్కడికి చేరుకున్న సిబ్బంది మంటలను అదుపు చేసేందుకు దాదాపు గంటన్నర సమయం పట్టింది. మంటలు చెలరేగిన సమయంలో అందులో ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు అంటున్నారు. నిబంధనలకు విరుద్ధంగా జనావాసాల మధ్య స్టాక్ గోడౌన్ ఏర్పాటు చేసిన వారిపై అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. కాగా అగ్ని ప్రమాదంలో రూ.4 లక్షల విలువైన బ్లీచింగ్ పౌడర్, పండ్లు అగ్నికి ఆహుతయ్యాయని అగ్నిమాపక శాఖ అధికారులు తెలిపారు. గోడౌన్‌లో స్టాక్ ఉంచిన బ్లీచింగ్ పౌడర్ కారణంగానే కెమికల్ రియాక్షన్ జరిగి భారీగా మంటలు ఎగిసిపడ్డాయని వారు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. భద్రాచలం అగ్నిమాపక శాఖ అధికారి శ్రీనివాస్, లీడింగ్ ఫైర్ ఫైటర్ సాధిక్, ఫైర్ ఫైటర్లు కుమారస్వామి, రాజబాబు, కిరణ్, ప్రకాష్ పాల్గొన్నారు.



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

బాధితులను ఆదుకోవాలి..

అగ్ని ప్రమాదంలో నష్టపోయిన పండ్ల వ్యాపారులను ఆదుకోవాలని సీఐటీయూ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. రెండు షాపుల్లో ఉన్న ఐదు నాలుగు చక్రాల బండ్లు పూర్తిగా కాలిపోయాయని, సుమారు రూ.లక్ష విలువైన పండ్లు కాలిపోయాయని తెలిపారు. ఈ ఘటనపై పూర్తి స్థాయిలో దర్యాప్తు చేసి నష్టపోయిన వారికి పరిహారం ఇప్పించాలని అన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఎం.బి. నర్సారెడ్డి, బండారు శరత్‌బాబు, సీపీఎం పట్టణ కార్యదర్శి గడ్డం స్వామి, పండ్ల వర్తక సంఘం నాయకులు వి.రాము బాలాజీ, వాసు, శ్రీను, రాము, జానీ, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఆశలు.. అడియాసలేనా?

- అర్ధంతరంగా ఆగిన సీఎం పర్యటన
- వాయిదా పడిందా.. రద్దయిందా తెలియని అయోమయం

చండ్రుగొండ : సీఎం సారొస్తారని.. తమ సమస్యలు పరిష్కారం అవుతాయని అనుకున్న గిరిజనుల ఆశలు అడియాసలుగానే మిగిలాయి. తమ ఊరికి రేవంత్‌రెడ్డి వస్తున్నారని, గ్రామానికి వరాలు కురిపిస్తారని బెండాలపాడులోని అన్ని వర్గాల ప్రజలు ఆశించారు. అంతేకాక జిల్లా అధికారులు సైతం ఇక్కడే అక్కడే మోహరించి సీఎం పర్యటన ఏర్పాట్లల్లో నిమగ్నమయ్యారు. దీంతో ఆ కుగ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. మరోవైపు సీఎం రాక కోసం చండ్రుగొండలో హెలీప్యాడ్ కూడా సిద్ధం చేశారు. దామరచర్లలో సుమారు 25 ఎకరాల్లో సభాస్థలి పనులు సగం వరకు పూర్తయ్యాయి. హైదరాబాద్ నుంచి పెద్ద ఎత్తున వాటర్ ప్రూఫ్ టెంట్లు వచ్చాయి. అయితే సీఎం పర్యటన అర్ధంతరంగా ఆగిపోగా.. అందుకు కారణమేంటనేది జవాబు దొరకని ప్రశ్నగా మిగిలిపోయింది. ఉపరాష్ట్రపతి ఎన్నిక నామినేషన్ కార్యక్రమంలో పాల్గొనేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ వెళ్తున్నారని, అందుకే ఇక్కడి పర్యటన వాయిదా పడిందని ఆ పార్టీ శ్రేణులు చెప్పినా.. సీఎం ఢిల్లీ కూడా వెళ్లకపోవడంతో ప్రజల్లో పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



హెలీప్యాడ్ వద్ద నుంచి తరలిస్తున్న కంకర

వెనక్కు తీసుకెళ్తున్న సభ సామగ్రి..

బెండాలపాడు గ్రామంలో బీటీ రోడ్డు పనులు చేపట్టగా అవి మధ్యలోనే నిలిచిపోయాయి. హెలీప్యాడ్ వద్ద వినియోగించేందుకు తీసుకొచ్చిన కంకరను రాత్రికి రాత్రే తీసుకెళ్తున్నారు. దామరచర్లలోని సభాస్థలి వద్దకు తీసుకువచ్చిన టెంట్ సామగ్రి సైతం తీసుకెళ్లిపోయారు. ఇదిలా ఉంటే ఎమ్మెల్యే జారె వర్గీయులు ఈనెల 30వ తేదీ లోపు సీఎం పర్యటన ఉంటుందని చెప్తున్నా.. ఆదినారాయణ మాత్రం ఎలాంటి ప్రకటన చేయలేదు.

ఉరి వేసుకుని ఆత్మహత్య



కిరణ్ (ఫైల్)

భద్రాచలంఅర్బన్: భద్రాచలానికి చెందిన ఓ వ్యక్తి ఉరి వేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. పట్టణంలోని రామాలయం ప్రాంతానికి చెందిన కిరణ్(38) గురువారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకున్నాడు. ఆయన ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు.

జ్వరంతో బాలుడు మృతి

అశ్వాపురం: మండలంలోని ఎలకలగూడెం గ్రామానికి చెందిన సవలం రవికుమార్(7) జ్వరంతో బాధపడుతూ గురువారం మృతి చెందాడు. మూడు రోజులుగా జ్వరంతో బాధపడుతున్న రవిని మణుగూరు ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించారు. అయినా పరిస్థితి మెరుగుపడక భద్రాచలం ఆస్పత్రికి తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందాడు.

రోడ్డు ప్రమాదంలో పోస్టుమ్యాన్ మృతి



జానకీరామ్ (ఫైల్)

టేకులపల్లి: మండలంలోని మాలపల్లికి చెందిన పోస్ట్‌మ్యాన్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మండలంలోని కొత్త తండా(పీ) పంచాయతీ పరిధి మాలపల్లి గ్రామానికి చెందిన గుమ్మడి జానకీరామ్(58) ప్రెగళ్లపాడు పోస్టాఫీసు పరిధిలో పోస్టుమ్యాన్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. ఈమేరకు బుధవారం రాత్రి బైక్‌పై వెళ్తుండగా ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించే క్రమంలో అదుపుతప్పి కింద పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. దీంతో జానకీరామ్‌ను హైదరాబాద్ తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ద్విచక్ర వాహనదారుడిపై కేసు నమోదు

పాల్వంచరూరల్ : వ్యక్తిని ఢీకొట్టి గాయపరిచిన ఘటనలో ద్విచక్రవాహనదారుడిపై పోలీసులు గురువారం కేసు నమోదు చేశారు. మండల పరిధిలోని నర్సమ్మగుడి సమీపంలో రోడ్డు పక్కన ఉన్న సుజాతనగర్‌కు చెందిన బోడ సక్రును రాజీవ్‌నగర్ కాలనీకి చెందిన మడకం శ్రీను తన బైక్‌తో ఢీ కొట్టగా సక్రు గాయపడ్డాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు శ్రీనుపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సురేష్ తెలిపారు.

ప్రేమ బంధం.. ఏడాదిలో విషాదం

ప్రమాదంలో భర్త మృతి,
పురిటి నొప్పులతో ఆస్పత్రిలో భార్య

ఇల్లెందురూరల్: పెద్దలు అంగీకరించకున్నా ప్రేమ వివాహం చేసుకున్న వారి కాపురం ఏడాది పాటు సాఫీగా సాగింది. వారంలోగా పండంటి బిడ్డ జన్మించనుందనే ఆనందంలో ఉండగా గురువారం జరిగిన రోడ్డు ప్రమాదం విషాదాన్ని నింపింది. మండలంలో మామిడిగుండాలకు చెందిన సూర్నపాక వెంకన్న (25), గార్ల మండలం గుంపెళ్లగూడేనికి చెందిన శ్రీజ ప్రేమ వివాహం చేసుకున్నారు. ప్రస్తుతం శ్రీజ తొమ్మిదో నెల గర్భిణి కాగా, ప్రసవం తేదీ సమీపించడంతో గురువారం ఆస్పత్రికి వెళ్లడానికి ఏర్పాట్లు చేసుకున్నారు. అయితే, శ్రీజ ఆధార్‌కార్డు స్వగ్రామమైన గుంపెళ్లగూడెంలో ఉండటంతో తీసుకురావాలని బంధువులకు సమాచారం ఇచ్చారు. ఈమేరకు భర్త వెంకన్న ముందుగానే బైక్‌పై చల్లసముద్రం వెళ్లి తిరిగి వస్తుండగా బురదగొర్రుతో ఉన్న ట్రాక్టర్ తగలడంతో కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. అదే సమయాన ఆటోలో అక్కడకు వచ్చిన శ్రీజ కన్నీటి పర్యంతమవుతూ స్పృహ కోల్పోయింది. దీంతో ఆమెను ఇల్లెందు ఆస్పత్రికి తరలించారు. శ్రీజ పురిటినొప్పులతో ఆస్పత్రిలోనే ఉండగానే.. ఆమెకు చివరి చూపు దక్కకుండానే వెంకన్న అంత్యక్రియలు పూర్తి చేశారు. కాగా, ప్రమాదానికి కారకుడైన ట్రాక్టర్ డ్రైవర్ మూతి శ్రీనును పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్



HOUSE FOR SALE

■ ఖమ్మం, ఇల్లందు రోడ్‌లో జయనగర్ కాలనీ ప్రక్కన SUDA లే అవుట్ వెంచర్‌లో న్యూ డీలక్స్ హౌసెస్ ప్రారంభం. 70 to 75 లక్షలు 90% బ్యాంక్ లోన్ సౌకర్యం సం.ప్ర. 7569618430, 9705902442 [SCA 25007431]



■ భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ప్రముఖ సంస్థలో ఫుల్ టైం క్యాషియర్ మేల్ / ఫీమేల్ మెస్స్ సూపర్‌వైజర్స్, అర్హత : 10th పాస్. వెంటనే కావలెను. సంప్ర. 63008 07705. [SCA 25007471]

■ ఖమ్మంలోని ప్రముఖ సంస్థనందు పనిచేయుటకు సెక్యూరిటీ సూపర్‌వైజర్స్ జీతం: 15-17 వేలు. సెక్యూరిటీ గార్డ్స్ 11-13 వేలు కావలెను. ఫోన్: 95050 82812, 86392 62139. [SCA 25007411]

■ తన్మయి ఓల్డేజ్‌హోమ్, విజయవాడ. పెద్దవారికి సేవచేయుటకు అనుభవంగల ఆడ, మగ వర్కర్లు, వంటమనుషులు కావలెను. వ॥20- 50 సం. 9652423559, 7093911010, 9573000987 [HA-406]

ప్రకటన గోరంత! స్పందన కొండంత!!
సాక్షి క్లాసిఫైడ్స్
ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు మా ప్రతినిధులను సంప్రదించండి
వివరాలకు :
ఖమ్మం : 9705444182, 9010299957
పాల్వంచ : 9705444183
భద్రాచలం : 9951602914
మణుగూరు : 9705944416
సత్తుపల్లి : 9652868642
మధిర : 9949927792

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజు ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.